సాక్షి అనకాపల్లి

బుధవారం ׀ 6 ׀ నవంబర్ ׀ 2024



లక్ష కుంకుమార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో లక్ష కుంకుమార్చన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలు పాల్గొన్నారు.



ఏయూలో విభాగాల తనిఖీ

విశాఖ సిటీ: ఏయూ రెక్టార్ కిషోర్‌బాబు నేతృత్వంలోని కమిటీ సభ్యులు మంగళవారం ఏయూలో పలు విభాగాలను తనిఖీ చేశారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం పేర్కొన్నారు. ఈనెల 8న 1 మి.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, గరిష్ట ఉష్ణోగ్రతలు 34.3 నుంచి 34.6 డిగ్రీల వరకు నమోదు కావచ్చని తెలిపారు.



చల్లగా చూడు నాగన్నా..

నాగుల చవితి పండగను మంగళవారం జిల్లా అంతటా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుటుంబ సమేతంగా పుట్టలో పాలు, గుడ్లు వేసి, చిమిలి, పళ్లు, కొబ్బరికాయలు, తేగలు నైవేద్యంగా సమర్పించారు. అనకాపల్లిలోని రాణిగారితోట, ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు ఆవరణలో, చోడవరం మండలం బంగారమ్మపాలెంలో, యలమంచిలి పట్టణంలోని పాతవీధి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో వేకువజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, పూజలు చేశారు.-సాక్షి న్యూస్ నెట్‌వర్క్



అనకాపల్లి ఎన్టీఆర్ మార్కెట్ ఆవరణలో పుట్టలో పాలు వేస్తున్న భక్తులు





అన్నపూర్ణగా భక్తులకు దర్శనమిచ్చిన భూలోకమాంబ అమ్మవారు, పంచరాత్రి ఉత్సవాలకు తరలివచ్చిన జనం

జన జాతర

జనమే జనం.. చూసి తీరాల్సిన సంబరం. పంచరాత్రుల శోభతో యలమంచిలి కళకళలాడింది. ఉమ్మడి విశాఖ నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. పట్టణ రహదారులు జనంతో కిక్కిరిసిపోయాయి. దీపావళి నుంచి నాగుల చవితి వరకు నిర్వహించే పంచరాత్రి ఉత్సవాల ముగింపు రోజైన మంగళవారం సుమారు లక్షన్నర మంది ఉత్సవాలను తిలకించడానికి వచ్చారు. ఆధ్యాత్మిక పరిమళానికి సాంస్కృతిక వైభవం తోడు కావడంతో ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. తులసీనగర్‌లో కొలువుదీరిన భూలోకమాంబ, పాతవీధి సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

8లో

న్యూస్‌రీల్

దీపం లబ్ధిదారులకు ఇంటి వద్దే ఈకేవైసీ

తుమ్మపాల: దీపం–2 పథకం లబ్ధిదారులకు అవసరమైన ఈకేవైసీ ప్రక్రియ గ్యాస్ డెలివరీ బాయ్‌ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దే ఉచితంగా చేయించేందుకు చర్యలు తీసుకున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. గత నెల 29 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు లబ్ధిదారులు తమ గ్యాస్ ఏజెన్సీ వద్ద బుక్ చేసుకుంటే ఈ పథకంలో మొదటి విడత ఉచిత సిలిండర్ సరఫరా జరుగుతుందన్నారు. డెలివరీ బాయ్ వినియోగదారుని ఇంటికి సిలిండర్ తెచ్చినప్పుడు ఖాళీ గ్యాస్ సిలిండర్ సిద్ధంగా ఉంచుకోవాలని, ఈ గ్యాస్ సిలిండర్ ఇతరులకు ఇవ్వరాదన్నారు. లబ్ధిదారుల సమస్యలు, సూచనలు సంబంధిత వార్డు, గ్రామ సచివాలయాలకు లేదా టోల్ ఫ్రీ నంబర్ 1967కు తెలియజేస్తే సత్వర చర్యలు తీసుకుంటామన్నారు.

అభిజిత్ కంపెనీ లే ఆఫ్ ఎత్తివేత?

అచ్యుతాపురం: అచ్యుతాపురం సెజ్‌లో కార్యకలాపాలు నిలిపివేసిన అభిజిత్ పరిశ్రమ లే ఆఫ్ ఎత్తివేయనున్నట్టు విశ్వసనీయ సమాచారం. బుధవారం యథావిధిగా కంపెనీ తెరిచే అవకాశం ఉంది. దీనిపై యాజమాన్యం అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. ఇటీవల లే ఆఫ్ ప్రకటించడంతో కార్మికుల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైన విషయం తెలిసిందే.

నేడు ఎస్సీ, ఎస్టీ (పీవోఏ) యాక్టుపై అవగాహన సదస్సు

అనకాపల్లి: విశాఖ సీఐడీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ (పీవోఏ) యాక్టుపై బుధవారం ప్రజలు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విశాఖ సీఐడీ అడిషినల్ ఎస్పీ జి.ప్రేమ కాజల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలోని వివేకానంద చారిటబుల్ ట్రస్ట్‌లో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ విజయ కృష్ణన్ హాజరవుతారని ఆమె చెప్పారు.

డిసెంబర్ 14న మెగా లోక్ అదాలత్



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్: వచ్చే నెల 14వ తేదీన మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ వెల్లడించారు. మంగళవారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, వివిధ కంపెనీల న్యాయ సలహాదారులు, బీమా, బ్యాంకులు, పోలీస్ అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి నెల రోజులపాటు అవగాహన శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కల్పించే న్యాయమూర్తులకు తమ సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధాన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ, ప్రధాన కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి రాధారత్నం, లోక్ అదాలత్ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ, సీనియర్ జూనియర్ న్యాయమూర్తులు, పలు జిల్లాల న్యాయమూర్తులు పాల్గొన్నారు.

నర్సీపట్నం దిగ్బంధం

- పట్టణం నలుమూలల మోహరించిన పోలీసులు



నర్సీపట్నంలో మంగళవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

నర్సీపట్నం: సీఐ రేవతమ్మ వైఖరికి నిరసనగా మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు పిలుపునివ్వడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రాకుండా పట్టణంలోని నాలుగు ప్రధాన కూడళ్లలో పోలీసులు మోహరించారు. మంగళవారం రాత్రి 11 గంటల నుంచి పోలీసులు ప్రధాన జంక్షన్లలో మోహరించి వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి విడిచిపెడుతున్నారు. ధర్నాను భగ్నం చేసేందుకు ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నారు. నాయకులు, కార్యకర్తలు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు పోలీసులు చేస్తున్న విశ్వ ప్రయత్నాలను చూసి జనం విస్తుపోతున్నారు. పద్ధతి ప్రకారం పనిచేసుకుపోతే సరిపోతుంది కదా ప్రజలకు ఈ కష్టాలు ఎందుకని వ్యాఖ్యానిస్తున్నారు.

నిరాశ్రయుల వసతిగృహాలను తరలించొద్దు



విశాఖ టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతిగృహం

- ప్రభుత్వానికి ఈఏఎస్ శర్మ లేఖ

సీతమ్మధార (విశాఖ): జీవీఎంసీ పరిధిలోని నిరాశ్రయుల వసతిగృహాలను తరలించాలన్న ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని మాజీ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ కోరారు. ఈ మేరకు ప్రభుత్వానికి రాసిన లేఖ ప్రతులను మంగళవారం మీడియాకు విడుదల చేశారు. 'నగరాల్లో రోడ్ల పక్కన, రైల్వే, బస్ స్టేషన్లు, ఆలయ ప్రాంగణాల్లో నివాసం ఉంటున్న నిరాశ్రయులకు షెల్టర్ ఏర్పాటు చేసి.. అందులో వారికి సౌకర్యాలు కల్పించాలని గతంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ మేరకు జీవీఎంసీ అప్పట్లో అందుబాటులో ఉన్న భవనాల్లో ఈ షెల్టర్లను ప్రారంభించింది. జీవీఎంసీ, ప్రభుత్వ రంగ సంస్థలు, దాతల ఆర్థిక సాయంతో... పోలీసుల సహకారంతో స్వచ్ఛంద సంస్థలు ఈ షెల్టర్లను నడుపుతున్నాయి. ఈ విధంగా 6,150 మంది నిరాశ్రయులకు ఈ షెల్టర్లలో ఆశ్రయమిచ్చారు. కొంత మందికి పలు రంగాల్లో శిక్షణ ఇచ్చి.. ఉపాధి కల్పించారు. మరికొంత మంది చిరునామాలు గుర్తించి.. వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అటువంటి నిరాశ్రయుల షెల్టర్లను నగర శివారు ప్రాంతాలకు తరలిస్తే వారికి భద్రత కరువవుతుంది. ముఖ్యంగా మహిళలకు పూర్తి స్థాయిలో భద్రత కల్పించ లేరు. కొంతమంది నిరాశ్రయులకు, ముఖ్యంగా వృద్ధులకు అందుబాటులో వైద్య సేవలుండాలి. ఇవన్నీ శివారు ప్రాంతాల్లో కల్పించ లేరు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం లక్ష జనాభాకు ఒక షెల్టర్ ఉండాలి. ఇంతవరకు ఆ ఆదేశాన్ని ప్రభుత్వం పూర్తిగా అమలు చేయలేదు. ప్రతీ రెండు మూడు వార్డులకు కనీస దూరంలో ఒక షెల్టర్ ఉండాలి. కానీ ప్రభుత్వం అన్ని షెల్టర్లను నగరంలోని మారుమూల ప్రాంతాలకు తరలిస్తే.. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించినట్లు అవుతుంది. ఎక్కడ ఉన్న షెల్టర్లను ఆ ప్రాంతాల్లోనే నడుపుతూ.. వాటిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి.' అని శర్మ తన లేఖలో పేర్కొన్నారు.

న్యాయం కావాలి

- ఇసుకను దోచేస్తుంటే మిన్నకున్నారు
- అడ్డుకుంటే మాపైనే కేసులు పెడుతున్నారు
- టీడీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారు
- అవసరమైతే సీఐపై న్యాయపోరాటం
- నేడు పోలీసు స్టేషన్ ముందు మాజీ ఎమ్మెల్యే గణేష్ ధర్నా

గబ్బాడ డిపోలో గుట్టలుగా ఇసుక ఉన్నా విచారణ పేరుతో ప్రజలకు అందకుండా చేశారు. నిర్మాణాలు ఆగిపోవడంతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు పస్తులున్నారు. వారి పక్షాన మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ గత నెల 21న నిరసన ర్యాలీకి పిలుపునివ్వడంతో హడావుడిగా డిపోను తెరిచారు. రాత్రి వేళ టీడీపీ నాయకులు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని లారీలను అప్పగిస్తే సీఐ రేవతమ్మ తిరిగి వైఎస్సార్‌సీపీ నాయకులపైనే కేసులు కట్టారు. వినతి పత్రం అందించినా స్పందించలేదు. టీడీపీకి కొమ్ము కాసేలా ప్రవర్తించడంతో తమకు న్యాయం చేయమని కోరుతూ మాజీ ఎమ్మెల్యే బుధవారం పోలీస్ స్టేషన్ ఎదుటే ధర్నాకు దిగుతున్నారు.



గత నెల 25న రాత్రి వేళ ఇసుక డిపోలో 40 టన్నుల సామర్థ్యం కలిగిన టిప్పర్లో ఇసుక లోడింగ్



సీఐ రేవతమ్మకు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, పార్టీ నాయకులు (ఫైల్)

నర్సీపట్నం: నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ తీరుపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. అందరి పట్ల సమ న్యాయం చూపాల్సిన పోలీసు అధికారి టీడీపీకి అనుకూలంగా ప్రవర్తించడం తగదని నిరసన వ్యక్తం చేస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014–19 మధ్య కాలంలో రేవతమ్మ నర్సీపట్నం సీఐగా సుదీర్ఘకాలం పాటు పనిచేశారు. అప్పట్లో టీడీపీకి అనుకూల సీఐగా ముద్ర వేసుకున్న ఆమెను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఏరికోరి మళ్లీ రూరల్ సీఐగా తీసుకొచ్చారన్న విమర్శలున్నాయి. స్పీకర్ వద్ద మెప్పు పొందేందుకు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సీఐ తమనే టార్గెట్ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. గత నెల 25వ తేదీ రాత్రి గబ్బాడ డిపోలోని ఇసుకను అనుమతులు లేకుండా రెండు లారీల్లో తరలించుకుపోతుంటే వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. ఇసుక అక్రమ తరలింపుపై సీఐ రేవతమ్మకు ఫిర్యాదు చేసేందుకు మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ పార్టీ నాయకులతో 26న సర్కిల్ కార్యాలయానికి వెళ్లారు. ఆ సమయంలో మాజీ ఎమ్మెల్యే పట్ల సీఐ వ్యవహరించిన తీరుకు చాలా బాధపడ్డామని వైఎస్సార్‌సీపీ నాయకులు వారిలో వారే చర్చించుకున్నారు. ఇసుక లారీలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని సీఐకి అప్పగిస్తే, ఇసుక దొంగలను వదిలేసి తిరిగి తమ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం ఆశ్చర్యం కలిగిస్తుందని మాజీ ఎమ్మెల్యే ఆవేదన చెందారు. సీఐ నియంతృత్వ పోకడలను పోలీసు ఉన్నతాధికారులకు తెలియజెప్పేందుకు బుధవారం పోలీసు స్టేషన్ ముందు శాంతియుత ధర్నాకు మాజీ ఎమ్మెల్యే సిద్ధమవుతున్నారు.

ఇసుక దుమారం

కొంత కాలంగా గబ్బాడ ఇసుక దుమారం నియోజకవర్గంలో రాజకీయ కాక రేపుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల అవసరాల కోసం గోదావరి ఇసుకను గబ్బాడ డిపోలో డంప్ చేశారు. ఇసుక అందుబాటులో ఉండడంతో భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అయ్యన్నపాత్రుడు ఇసుక డిపోలో జరిగిన అక్రమాలపై నిగ్గు తేల్చే వరకు ఇసుక సరఫరా నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. ఇసుక లేక ఇబ్బంది పడుతున్న భవన నిర్మాణ కార్మికులకు మాజీ ఎమ్మెల్యే గణేష్ అండగా నిలిచారు. ప్రజలకు ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ గత 21న మాజీ ఎమ్మెల్యే ర్యాలీకి పిలుపునిచ్చారు. ర్యాలీ తరువాత ఇసుక ఇస్తే ఆ క్రెడిట్ వైఎస్సార్‌సీపీకి దక్కుతుందన్న ఉద్దేశంతో ఆదరాబాదరాగా టీడీపీ నాయకులు, అధికారులు ఇసుక విక్రయాలను ప్రారంభించారు. టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా 40 టన్నుల సామర్థ్యం కలిగిన రెండు లారీలు తీసుకువెళ్లి డిపోలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. టీడీపీ నాయకుల ఇసుక దందాను బయటపెట్టారనే కక్షతో సీఐతో ముగ్గురిపై కేసులు పెట్టించారు. ఈ కేసులు అక్రమమని మాజీ ఎమ్మెల్యే గణేష్ పోలీసు స్టేషన్ ఎదుట శాంతియుత ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి, వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. బుకింగ్ రసీదు లేకుండా టిప్పర్‌లోకి ఎందుకు లోడ్ చేశారని..? సిబ్బందిపై ఏమైనా క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారా..అని? ఇసుక లోడింగ్‌కి వచ్చిన టిప్పర్ల మీద పోలీసులకు ఫిర్యాదు చేశారా..? అని విలేకరులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. ఇసుక అక్రమాలను బయటపెట్టాలనుకున్న టీడీపీ నేతలు వారు తీసుకున్న గోతిలో వారే పడినట్టయింది. తప్పుడు కేసులు పెట్టిన సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే స్టేషన్ ముందు ధర్నాకు దిగుతున్నారు.

అక్రమ కేసులకు నిరసనగా.. శాంతియుత ధర్నా

నర్సీపట్నం: సీఐ రేవతమ్మ పెట్టిన అక్రమ కేసులను ఖండిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ అన్నారు. అక్రమ కేసులను నిరసిస్తూ బుధవారం పోలీసు స్టేషన్ వద్ద చేపట్టిన శాంతియుత ధర్నాలో పార్టీ శ్రేణులు అంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇసుక దోపిడీని కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో భాగంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, టీడీపీ నాయకులు, సీఐ కుమ్మక్కై తప్పుడు కేసులు పెట్టారన్నారు. సీఐ వ్యవహారశైలిని ఎస్పీ, డీఐజీ, డీజీపీకి తెలియజేయాలనే స్టేషన్ ముందు శాంతియుత ధర్నా చేపడుతున్నామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పథకాల పంపకం 'పచ్చ'గా..

అనకాపల్లి మండలం రేబాక గ్రామంలో సెప్టెంబర్‌లో గోకులం షెడ్‌కు కోసం అన్ని అర్హతలు గల ఏడుగురు పాడి రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎం.నారాయణ తండ్రి నూకరాజు అనే పాడి రైతు పేరును గ్రామ సభలో తీర్మానం కూడా చేసి పంపించారు. కానీ స్థానిక జనసేన ఎమ్మెల్యే సిఫారసు చేసిన ఆ పార్టీ కార్యకర్తకే షెడ్ మంజూరైంది. గ్రామ సభలో తీర్మానం కూడా చేపట్టలేదు.

- కూటమి నేతల సిఫార్సుల మేరకే మినీ గోకులం షెడ్ల మంజూరు
- అర్హులైన పాడిరైతుల పట్ల వివక్ష
- తొలివిడతలో 750 షెడ్లకు 1,008 దరఖాస్తులు
- అరకొర కేటాయింపులు

సాక్షి, అనకాపల్లి :

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదు నెలలు కావస్తోంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేసిన పాపాన పోలేదు. ఇక రైతుల కోసం అందిస్తామని చెప్పిన రైతు భరోసా లాంటి పథకాల ఊసే లేదు. రైతులు పెట్టుబడుల పెట్టేందుకు అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. ఈ ప్రభుత్వం పాడి రైతుల కోసం అందించే మినీ గోకులం లాంటి పథకంలో కూడా కూటమి ప్రజా ప్రతినిధుల టిక్ పెట్టిన వారికే అధికారులు మంజూరు చేయడం జరిగింది. పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తామని చెబుతూ కూటమి ప్రభుత్వం ఏక పక్షంగా మినీ గోకులం పేరిట పశువుల షెడ్ల మంజూరులో అవకతవకలకు పాల్పడింది. పార్టీలకతీతంగా మంజూరు చేయాల్సిన గోకులం షెడ్లలో 90 శాతం వరకూ ఏకపక్ష వైఖరితోనే మంజూరు చేసింది. అవి కూడా కూటమి నేతలకు సరిపోలేదని.. మరో వెయ్యి షెడ్లు కావాలంటూ ప్రతిపాదనలు కూడా పెట్టినట్టు అధికారుల సమాచారం. తొలి విడతలో కేటాయించిన 750 షెడ్లలో ఒక్కటి కూడా నియమ నిబంధనల ప్రకారం అమలు చేయలేదు. కనీసం తరువాత వచ్చే వాటిలోనైనా తమకు కేటాయించాలంటూ రైతన్నలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

మరో వెయ్యి షెడ్లకు ప్రతిపాదన

జిల్లాలో అరకొరగా కూడా యూనిట్లు కేటాయించలేదంటూ రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీకొక షెడ్డు కూడా లేకపోవడంతో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని దరఖాస్తు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం ఆధారంగా 750 షెడ్లకు మాత్రమే దరఖాస్తులు కోరారు. వీటికి 1009 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 632 షెడ్లు ఇప్పటికే మంజూరు చేశారు. వీటిలో 90 శాతం షెడ్ల వరకూ కూటమి ప్రజా ప్రతినిధులు చెప్పినవారికే ఇచ్చినట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హత గల పాడిరైతులకు కాకుండా ప్రజాప్రతినిధుల ఇచ్చిన జాబితా ప్రకారమే షెడ్ల కేటాయింపు జరిగింది.



స్థానిక ఎమ్మెల్యే చెప్పిన వారికే ఇవ్వడం జరిగినట్టు అధికారులు రైతులకు చెబుతున్నారు. అయితే ఇటీవల డీఆర్‌సీ సమావేశంలో తమ నియోజకవర్గాల్లో మినీ గోకులం షెడ్లు సరిపోవడం లేదంటూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో మరో వెయ్యి షెడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

నాటి కష్టాలే మళ్లీ...

గోకులం షెడ్లకు సంబంధించి 2018–19 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో పాడి రైతుకు ఎదురైన కష్టాలే ఇపుడు మళ్లీ పునరావృతం అవుతున్నాయి. అప్పట్లో ఈ పథకం కేవలం ప్రచార ఆర్భాటానికే పరిమితమైంది తప్ప పాడి రైతులకు ప్రయోజనం చేకూర్చలేదు. బిల్లులు వస్తాయనే ఆశతో ముందుగానే రైతులు నిర్మించుకున్న షెడ్లకు బిల్లులు మంజూరు కాకపోవడంతో అప్పుల పాలైన సంగతి అందరికీ తెలిసిందే. తాజాగా కూటమి ప్రభుత్వం ఆ పథకాన్ని మళ్లీ అమలు చేసినా..తీరు సవ్యంగా లేదు. కూటమి పార్టీ ప్రజాప్రతినిధులు సిఫారసు చేసిన వారికే తొలి విడతలో షెడ్లు ఖరారు చేశారు.

పథకం అమలు ఇలా..

మినీ గోకులం పథకం ద్వారా ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రాయితీ అందిస్తుంది. పశు సంవర్ధకశాఖ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తుండగా, డ్వామా విభాగం నుంచి నిధులు మంజూరు చేస్తారు. తుదిగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పర్యవేక్షణలోనే ఎంపిక జాబితా తయారవుతుంది. ఆవులు, గేదెల షెడ్లకు 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 70 శాతం రాయితీను ప్రభుత్వం అందిస్తోంది. పాడి రైతు దరఖాస్తును ఎంపిక చేసిన తరువాత వివిధ దశల వారీగా షెడ్ల నిర్మాణం చేపడతారు. పునాది దశ, శ్లాబ్ దశ, పూర్తయిన తరువాత మూడు దశల్లో నిధులు మంజూరు చేస్తారు.

ప్రతి దశలోనూ స్థానిక పశుసంవర్ధక, డ్వామా విభాగానికి సంబంధించిన అధికారులు వచ్చి నిర్మాణ పనులను పర్యవేక్షించిన తరువాతనే బిల్లు మంజూరు చేస్తారు. ఇప్పటివరకూ వచ్చిన దరఖాస్తులను పశువర్ధక శాఖ, డ్వామా విభాగం వారు పరిశీలన అనంతరం అవి జిల్లా కలెక్టర్‌కు చేరతాయి. అక్కడ తుది జాబితాను విడుదల చేస్తారు.

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే..

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అనకాపల్లి జిల్లాకు 750 షెడ్లు కేటాయించారు. దరఖాస్తులు ఎక్కువగా రావడంతో మరో వెయ్యి షెడ్లు పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఇప్పటి వరకూ దరఖాస్తు చేసుకున్న రైతుల్లో 99 శాతం మంది పాడి రైతులే. ఇంకా కొన్ని మండలాల్లో దరఖాస్తు ప్రక్రియకు అవకాశం కల్పిస్తాం. మా శాఖ నుంచి అర్హులను గుర్తించడం వరకే మా పని. ఆ తరువాత ఎంపిక విధానం, మంజూరు చేసే ప్రక్రియ డ్వామా విభాగం వారు చూసుకుంటారు.

– డాక్టర్ రామ్మోహన్‌రావు, పశుసంవర్ధక శాఖ జేడీ

క్లుప్తంగా

నవ్వులు పంచిన చిన్నయ్యపాలెం యువత



విచిత్ర వేషధారణలలో గ్రామంలో నవ్వులు పంచుతున్న యువకులు

గొలుగొండ: నేటి ఆధునిక యుగంలో సంప్రదాయాలు మరిచిన యువతరానికి గొలుగొండ మండలం చిన్నయ్యపాలెం యువత ఆదర్శంగా నిలుస్తున్నారు. పండగలను పూర్వం ఎలా చేసేవారో పెద్దల వద్దకు వెళ్లి తెలుసుకుని అలాగే నిర్వహిస్తున్నారు. పండగలు అంటేనే సందడి అంటూ చాటి చెబుతున్నారు. చిన్నయ్యపాలెంలో సుమారుగా 25 మంది యువత ఉన్నారు. వీరంతా ప్రభుత్వ, పలు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరంతా రెండేళ్లుగా దసరా, దీపావళి, సంక్రాంతితో పాటు గ్రామ దేవత పండగలో విచిత్ర వేషధారణలతో సందడి చేసి ఆకట్టుకుంటున్నారు. మంగళవారం నాగులచవితి సందర్భంగా గ్రామానికి వచ్చిన యువకులు పలు వేషధారణలతో సందడి చేశారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి అలరించారు. దీంతో చిన్నయ్యపాలెం యువకులను గ్రామ పెద్దలు అభినందించారు.

సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మృతి

మధురవాడల(విశాఖ): బక్కన్నపాలెం 234 సీఆర్‌పీఎఫ్ యూనిట్‌లో పనిచేస్తున్న సోమి త్యాగి(43) అనే కానిస్టేబుల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలివీ. ఈ యూనిట్‌లో పనిచేస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన సోమి త్యాగి దైనందిన కార్యకలాపాల తర్వాత అస్వస్థతకు గురికావడంతో అధికారులు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం నగరంలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. తర్వాత వాంతులు అవ్వడం, తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జన జాతర





జనాన్ని ఉర్రూతలూగించిన డ్యాన్స్‌లు



స్టెప్పులతో అదరగొడుతున్న డ్యాన్సర్లు



ప్రత్యేక ఆకర్షణగా నేల వేషాలు

- ఘనంగా ముగిసిన పంచరాత్రి ఉత్సవాలు
- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన జనం
- విద్యుత్ కాంతులతో ధగధగలాడిన యలమంచిలి పట్టణం
- ఉర్రూతలూగించిన సాంస్కృతిక కార్యక్రమాలు



వెండి కవచం అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

యలమంచిలి రూరల్: ఊర్లకు ఊర్లే కదిలి రావడంతో పట్టణం పరవశించింది. పంచరాత్రుల శోభతో యలమంచిలి కాంతులీనింది. ఇసుకేస్తే రాలనంతగా రహదారులు జన జాతరతో కిక్కిరిసి పోయాయి. ఉమ్మడి విశాఖ నుంచే కాకుండా పక్క జిల్లాల నుంచి కనీవినీ ఎరగని రీతిలో పంచరాత్రి ఉత్సవాలకు భక్తులు తరలివచ్చారు. దీపావళి నుంచి నాగుల చవితి వరకు నిర్వహించే పంచరాత్రి ఉత్సవాల ముగింపు రోజైన మంగళవారం సుమారు లక్షన్నర మంది ఉత్సవాలను తిలకించడానికి రావడంతో యలమంచిలిలో ఎటు చూసినా జనసందోహమే కనిపించింది. ఒక వైపు ఆధ్యాత్మిక పరిమళం, మరోవైపు సాంస్కృతిక వినోదం మేళవింపుతో ఉత్సవాలు అంబరాన్నంటాయి. జీవితంలో ఒక్కసారైనా ఈ పంచరాత్రి ఉత్సవాలను తిలకించాలన్న మధురానుభూతిని భక్తులు మదినిండా దాచుకున్నారు. ఐదు రోజుల పాటు పట్టణంలో జరిగే పంచరాత్రి ఉత్సవాలకు ఎంతో విశిష్టత ఉంది. దాదాపు 80 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు ఈ ఏడాది కూడా ఘనమైన ఏర్పాట్ల మధ్య జరిగాయి. ముగింపు రోజైన మంగళవారం సాయంత్రం 6 నుంచి తెల్లవారుజాము వరకూ భక్తజనంతో పట్టణంలో రహదారులు రద్దీగా కనిపించాయి. రాత్రి 7 గంటల నుంచి కాలు కదపడమే కష్టమన్నట్టుగా జనంతో ప్రధాన రహదారి, తులసీనగర్, పాతవీధి, దిమిలి రోడ్డు, మార్కెట్ జంక్షన్లు కిక్కిరిసి పోయాయి. గురప్ప సత్రం కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో పిల్లలు, యువతీ యువకులు సందడి చేశారు. జాతరలో భాగంగా ప్రదర్శించిన చెక్క భజనలు, కోలాటాలు, నేల వేషాలు ఆధ్యాత్మికతను ఉట్టిపడేలా చేశాయి. జాతర సందర్భంగా పోలీసు అధికారులు ముందు జాగ్రత్తగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ నేతృత్వంలో 200 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత నిర్వహించడంతో జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగిసింది.

భూలోకమాంబ, సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

తులసీనగర్‌లో కొలువుదీరిన భూలోకమాంబ, పాత వీధి సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం నాగుల చవితి కావడంతో సుబ్రహ్మణ్యస్వామికి అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి, నూతన వస్త్రధారణ చేశారు. అనంతరం ధూప, దీప నైవేద్య, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. భూలోకమాంబ అమ్మవారికి అష్టోత్తర, సహస్రనామ కుంకుమార్చన చేశారు. శ్రీసూక్తం, దుర్గాసూక్తంతో పూజలు చేశారు. రెండు ఆలయాల్లో భూలోకమాంబ, సుబ్రహ్మణ్య స్వామి దర్శనాలకు భక్తులు క్యూ కట్టారు.

అమ్మవారు, స్వామివార్లను పలువురు ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, ప్రముఖులు పంచరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, మళ్ల కొండబాబు, కర్రి జానకిరాం, తదితరులు దర్శించుకోవడానికి వచ్చిన ప్రముఖులకు ఉత్సవ కమిటీ సభ్యులు సాదరంగా స్వాగతం పలికి అమ్మవారి దర్శనాన్ని చేయించారు. దర్శనం అనంతరం శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. భూలోకమాంబ అమ్మవారు బాల త్రిపురసుందరిదేవిగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



ఉత్సవాలకు తరలివచ్చిన జనంతో కిక్కిరిసిన ప్రధాన రహదారి

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పంచరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8 వేదికలపై భారీగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. డీజే సౌండ్లు, రంగురంగుల లైటింగ్ వెలుగుల మధ్య డ్యాన్సర్లు, యువకులు వేసిన స్టెప్పులు ఆహూతులను ఉర్రూతలూగించాయి. వేర్వేరు డ్యాన్స్ బృందాలతో పాటు అలనాటి బుర్రకథ ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. స్టేజీల వద్ద యువకులతో పాటు కొందరు వృద్ధులు కూడా ఉత్సాహంతో స్టెప్పులు వేసి, సందడి చేశారు.

నేటి నుంచి రసజ్ఞ జాతీయ నాటకోత్సవాలు

మద్దిలపాలెం(విశాఖ): స్థానిక కళాభారతిలో బుధవారం నుంచి శనివారం వరకు రసజ్ఞ 3వ జాతీయ నాటకోత్సవాలు జరగనున్నట్లు రసజ్ఞ వ్యవస్థాపక అధ్యక్షుడు, నాటకోత్సవాల డైరెక్టర్ డాక్టర్ వేమలి త్రినాథరావు తెలిపారు. రోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ నాటకోత్సవాలు భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ, సౌజన్యంతో, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, ఏపీ భాషా సాంస్కృతికశాఖల సంయుక్త నిర్వహణలో జరుగుతాయన్నారు. ఈ ప్రదర్శనలకు అందరూ ఆహ్వానితులేనని వెల్లడించారు.

ప్రదర్శించే నాటకాలు

- 6న మధుర స్వరం తెలుగు నాటకాన్ని ప్రదర్శించనున్నారు. ఈ నాటకాన్ని డి.హేమావెంకటేశ్వరి రచించగా, ఉత్సవ నిర్వాహకుడు, రసజ్ఞ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వేమలి త్రినాథరావు దర్శకత్వం వహించనున్నారు.
- 7న ఎన్‌హెచ్–316 ఒడియా నాటకాన్ని అభినయ జాగృతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లోని ఉత్కల్ సంగీత మహావిద్యాలయ సభ్యులు పాత్రధారులుగా ఈ నాటకాన్ని ప్రదర్శించనున్నారు. మాస్ ప్రజల్ని ఆడిటోరియంలోకి రప్పించడమే లక్ష్యంగా సామాజిక సందేశాలను వాస్తవికంగా తెలియజేయడంలో ఈ గ్రూప్ ప్రసిద్ధి. అజిత్‌దాస్ రూపకల్పనలోని ఈ నాటకాన్ని దీపక్ రంజన్‌పాటి(అమాన్) పర్యవేక్షించనున్నారు.
- 3వ రోజు(8న) దేబాషిష్ దత్ స్థాపించిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాక్చువల్ థియేటర్ ఆర్ట్స్(ఐఎఫ్‌టీఏ) ఆధ్వర్యంలో స్వీయ దర్శకత్వంలో బెంగాలీ నాటకం 'కృష్ణ'ను ప్రదర్శించనున్నారు. పాతికేళ్లుగా 50కి పైగా థియేటర్ ప్రొడక్షన్లను ఏర్పాటు చేసిన ఘనత ఈ సంస్థది.
- 9న దివాకర్‌బాబు మాడభూషి రచించిన భూత కాలం నాటకాన్ని ప్రదర్శించనున్నారు. దీనికి డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వం వహించనున్నారు.
- తెలుగు నాటకాలతోపాటు, ఒడియా, బెంగాలీ నాటకాలు కూడా ప్రేక్షకుల్ని విశేషంగా అలరిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

26న రైతు, కార్మిక సంఘాల సమావేశం

అనకాపల్లి: రైతు, కార్మిక హక్కుల కోసం యువత ఉద్యమించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు వర్రేపు సూర్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో అఖిల భారత రైతాంగ పోరాట సమన్వయ కమిటీ (ఏఐకేఎస్‌ఈసీ) జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు ఆధ్వర్యంలో మంగళవారం రైతు సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాల పరిరక్షణ కోసం ఈ నెల 26న దేశ వ్యాప్తంగా జిల్లా కేంద్రాల వద్ద సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు అనకాపల్లిలో కూడా రైతు, కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేసి, పంటలకు గిట్టుబాటు ధరకు చట్టం చేయాలని ఆయన కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం పనులను 200 రోజులకు పెంచి, రోజు వేతనం రూ.600 చెల్లించాలన్నారు. మహిళలపై అత్యాచారాలను అరికట్టాలని, నిత్యావసరాల సరకుల ధరలు తగ్గించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న 18 లక్షల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వై.ఎన్.భద్రం, రైతు సంఘాల జిల్లా నాయకులు ఎం.అప్పలరాజు, కోరిబిల్లి శంకరరావు, బాలు గాడి, డి.వెంకన్న, గంటా శ్రీరామ్, డి.డి.వరలక్ష్మి, వి.వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వర్రేపు సూర్యనారాయణ

కళకాలం గుర్తుండాలి



అటు అందం.. ఇటు అభినయం కలగలిపిన విశాఖ సోయగం హేమలతారెడ్డి.. గ్లామర్ ఫీల్డ్‌లో పాదరసంలా దూసుకుపోతున్నారు. బుల్లితెర, వెండితెర, ఫ్యాషన్ రంగాల్లో తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. పలు టీవీ చానళ్లలో యాంకర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె దినదిన ప్రవర్ధమానంగా ఎదుగుతూ వచ్చారు. అటు సీరియళ్లు, సినిమాలు.. ఇటు ఫ్యాషన్ రంగంలో విజయాలతో తన కలలను సాకారం చేసుకుంటున్నారు. వెండితెరపై నా పేరుండాలి.. నా నటన అందరూ గుర్తు పెట్టుకోవాలి.. అని అంటున్న ఆమె హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇటీవల ఓ ఈవెంట్‌లో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడారు. - సీతమ్మధార(విశాఖ)

విశాఖలోనే ఓనమాలు

విశాఖ నటనలో నాకు ఓనమాలు నేర్పింది. ఇక్కడ ఎన్నో విషయాలు నేర్చుకున్నా.. ఇప్పుడీస్థాయిలో ఉండడానికి కారణం నా తల్లిదండ్రులే. డాబాగార్డెన్స్‌లో ఉంటున్నాం. నాన్న సూర్యదేవర వెంకటరావు నేవీలో పనిచేసి రిటైరయ్యారు. ఇక్కడే సెటిల్ అయ్యారు. చదువంతా సెయింట్ జోసెఫ్ విద్యాసంస్థలో సాగింది. తాను ఇంటర్ వరకు అక్కడే చదివా. తర్వాత ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ క్లాసికల్ చేశా. తల్లి ధనలక్ష్మి ఫైనాన్స్ వ్యాపారం.

న్యూస్‌రీడర్ నుంచి హీరోయిన్ వరకు..

నాన్న నన్ను న్యూస్ రీడర్‌గా చూడాలనుకున్నారు. ముందుగా టీవీ 9, తర్వాత ఎన్‌టీవీలో ఎంటర్‌టైన్‌మెంట్ షోలు చేశా. ఎందరో హీరోయిన్లను ఇంటర్వ్యూ చేశా. జెమిని టీవీలో సినిమా న్యూస్‌రీడర్‌గా చేశా. మంచు విష్ణు నిర్మించిన హ్యాపీడేస్ సీరియల్‌లో కల్యాణి పాత్రలో నటించా. ఆ సీరియల్‌కు, అందులో నా పాత్రకు మంచి ఆదరణ లభించింది. అంతఃపురం, క్రైమ్ తదితర సీరియల్స్ చేశాను. జెమిని, మా టీవీలో నేను నటించిన సీరియల్స్ ప్రసారమయ్యాయి. నేను ఇప్పటివరకు సుమారుగా 20 వరకు సీరియల్స్‌లో నటించాను. గతంలో విశాఖ బిగ్ ఎఫ్ఎంలో జాబ్ కోసం ట్రై చేశా. ఇప్పుడు అదే ఎఫ్ఎంలో నన్ను ఇంటర్వ్యూ అడగడం చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది. టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేష్‌బాబుతో నటించాలన్నదే నా చిరకాల కోరిక. సౌందర్య, సమంత తన అభిమాన హీరోయిన్లు. తెలుగు హీరోయిన్లు అంజలి, వైష్ణవి సినిమాల్లో రాణిస్తున్నారు. వారి లాగే నన్ను ప్రేక్షకులు ఆదరిస్తున్నందుకు ఆనందంగా ఉంది. వీరభద్ర క్రియేషన్స్ పేరిట సొంత బ్యానర్ 2017లో ప్రారంభించాను.

- బుల్లితెర, వెండితెరపై రాణిస్తున్న హేమలతారెడ్డి
- ఫ్యాషన్ రంగంలోనూ సత్తా
- గ్లామ్ ఆన్ మిసెస్ ఇండియాగా విశేష గుర్తింపు



గ్లామర్ ఆన్ మిసెస్ ఇండియా అవార్డుతో

విశాఖలో జన్మించిన పోతురెడ్డి హేమలతా రెడ్డి మలేసియాలో జరిగిన గ్లామ్ ఆన్ మిసెస్ ఇండియాగా నిలిచారు. మొదట లోకల్ టీవీ, జెమినీ టీవీ యాంకర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె.. ఆ తర్వాత పలు షోలో పాల్గొన్నారు. హ్యాపీడేస్ సీరియల్‌లో లీడ్ రోల్ చేసి బుల్లితెర ప్రేక్షకుల మనసులు దోచుకున్నారు. అనంతరం హీరో జగపతిబాబుతో ప్రవరాఖ్యుడు సినిమాలో నటించారు. అందులో హేమలతా రెడ్డి హీరోయిన్ ప్రియమణి స్నేహితురాలిగా నటించారు. నిన్నే చూసి సినిమాలో హీరోయిన్‌గా నటించి నిర్మాతగా వ్యవహరించారు. అక్కడ నుంచి మిసెస్ ఇండియా పోటీలో విశాఖ నుంచి ప్రాతినిధ్యం వహించి ప్రపంచ వ్యాప్తంగా 300 మందిలో విజేతగా నిలిచారు.

తొలి సినిమా ప్రవరాఖ్యుడు

నా తొలి సినిమా ప్రవరాఖ్యుడులో హీరోయిన్ ప్రియమణికి స్నేహితురాలిగా చేశా. నిన్నే చూసి సినిమా తనకు రెండోది. ఆకృతి టచ్ మీ నాట్ సినిమాలో వైవిధ్యమైన పాత్రలో నటించాను. నాకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. నాన్న ప్రోత్సాహంతో పసుమర్తి సీతారామయ్య వద్ద నృత్యం నేర్చుకున్నాను. ఆ శిక్షణ ఇప్పుడు సినిమాలు, సీరియల్స్‌లో ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

గ్లామ్ ఆన్ మిసెస్ ఇండియాగా...

గ్లామ్ ఆన్ మిసెస్ ఇండియా విన్నర్ నేనే. మలేసియాలో సెప్టెంబర్ జరిగిన పోటీల్లో విజేతగా నిలవడం సంతోషంగా ఉంది. ఫ్యాషన్‌షోలో టైటి ల్ గెలవడం ఇదే తొలిసారి. తల్లిదండ్రులు, నా భర్త ప్రోత్సాహంతో ఈ రంగంలో రాణిస్తున్నాను. మంచి పాత్రలతో మెప్పించాలని నా డ్రీమ్.. చాలా కథలు వింటున్న.. త్వరలోనే నా తదుపరి చిత్రాల వివరాలు వెల్లడిస్తా..

అంతర్గత శక్తి కోసం శక్తి ఉపాసన దీక్ష

షష్టి పూర్తి వేడుకలో శారదా పీఠాధిపతి ప్రకటన



స్వామీజీకి పాదపూజ చేస్తున్న దృశ్యం

పెందుర్తి: అంతర్గత శక్తి కోసం వచ్చే ఏడాది పాటు శక్తి ఉపాసన దీక్ష చేపట్టనున్నట్లు శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ ప్రకటించారు. వారణాసి గంగానదీ తీరంలోని శారదాపీఠం శాఖలో స్వామీజీ షష్టి పూర్తి మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామీజీకి పాదపూజ చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తూ అద్వైత సిద్ధాంత వ్యాప్తి కోసం, సామాజిక బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పీఠం ఎల్లప్పుడూ పనిచేస్తుందన్నారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ స్వామీజీ స్ఫూర్తికి అనుగుణంగా భక్తకోటి అభ్యుదయం కోసం పీఠం మరింత కృషి చేస్తుందన్నారు. మైసూర్ గణపతి సచ్చిదానంద సరస్వతి, పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద సరస్వతి, హర్యానా పీఠం మాతాజీ, ఉత్తరప్రదేశ్ విధురాశ్రమ అధిపతి కుమారానంద గిరి స్వామి, అవధ్ ప్రాంతం నుంచి సర్కార్ జీ, రిషికేష్ సచ్చిదానంద ఆశ్రమ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో ఎండోస్కోపీ మిషన్ ప్రారంభం



ఎండోస్కోపీ మిషన్‌ను ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట(విశాఖ): కేజీహెచ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగానికి రూ.20 లక్షల విలువైన ఎండోస్కోపీ మిషన్‌ను బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం జోన్ వితరణగా ఇచ్చింది. ఈ మిషన్‌ను మంగళవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ప్రారంభించారు. పేద రోగులకు ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందని కేజీహెచ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ గిరినాథ్ చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ శ్రీనివాస్, డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎన్.సీతారామ్, ఫెడరేషన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.నాగేశ్వరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ వంశీ యాదవ్, డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తెగిపడి రెండు ఆవుల మృతి



మృతి చెందిన ఆవులు

కె.కోటపాడు : వ్యవసాయ మోటార్లకు వెళ్లే త్రీఫేజ్ విద్యుత్ లైన్ తీగ తెగిపడి రెండు ఆవులు మృతి చెందిన ఘటన కె.కోటపాడు మండలం చౌడువాడలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు అమరపల్లి నూకేశ్వరరావు ఉదయాన్నే ఆవుల నుంచి పాలను తీసుకుని పాక వద్ద ఆరుబయట కట్టి ఇంటికి వచ్చేశారు. పశువుల పాక మీదుగా త్రీఫేజ్ ఎలక్ట్రికల్ తీగలు ఉన్నాయి. సమీపంలోని విద్యుత్ స్తంభం వద్ద ఉన్న పిన్ ఇన్సులేటర్ పేలడంతో తీగ తెగిపడి రెండు ఆవులపైనా పడింది. దీంతో షాక్‌కు గురైన ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఆవుల ఖరీదు రూ.1.50 లక్షల ఉంటుందని స్థానిక రైతులు తెలిపారు.

రోడ్డు వేయండి.. డోలీ మోత తప్పించండి



లోసింగిలో డోలీలతో వినూత్నంగా నిరసన తెలుపుతున్న గిరిజనులు

రోలుగుంట: మండలంలోని అర్ల గిరిజన పంచాయతీ శివారు కొండ శిఖరాగ్ర గ్రామాలకు వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలంటూ మంగళవారం డోలీలతో బాధిత గ్రామాల గిరిజనులు వినూత్నంగా నిరసన తెలిపారు. వీరి నిరసనకు నాయకత్వం వహించిన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.గోవింద మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ పంచాయతీ శిఖరాగ్ర గ్రామాలైన పిత్రుగెడ్డ, చిన లోసింగి, పెదలోసింగి, పెదగరువు తదితర గిరిజన గ్రామాలకు 2022–25లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఐటీడీఏ పాడేరు వారి ద్వారా మెటీరియల్ కాంపొనెంట్ నిధుల నుంచి కోటి రూపాయలు మంజూరు చేసిందని, అయితే ఎన్నికల కోడ్ కారణంగా రోడ్డు పనులు జరగలేదని తెలిపారు. ప్రభుత్వం మారాక ఈ నిధులతో వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని రెండు నెలలుగా పలు రూపాల్లో నిరసనలు చేపట్టినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. తక్షణమే ఈ రోడ్డు పనులు చేపట్టాలని లేకుంటే జిల్లా స్థాయిలో తమ ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో కొర్ర రాజు, మర్రి కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఆవేదన దీక్ష ప్రారంభం



పాడేరు ఐటీడీఏ ఎదుట దీక్ష చేపట్టిన అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఏపీ ఆదివాసీ జేఏసీ ప్రతినిధులు

పాడేరు : గిరిజన యువతకు మేలు చేసే జీవో నంబరు 3ను పునరుద్ధరించాలని గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖీ శేషాద్రి డిమాండ్ చేశారు. మంగళవారం ఐటీడీఏ ఆవరణలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఏపీ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో 48 గంటల ఆదివాసీల ఆవేదన దీక్షను ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు దీక్షను కొనసాగించారు. బుధవారం కూడా సాయంత్రం వరకు దీక్షను కొనసాగించి వినతి పత్రాన్ని అధికారులకు అందజేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నంబరు 3ను కొనసాగించాలని, లేకుంటే ప్రత్యామ్నాయ జీవో ప్రవేశపెట్టి డీఎస్సీ ఉద్యోగాలను భర్తీ చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. సుప్రీంకోర్టు రద్దు చేసిన జీవో నంబరు 3ను పునరుద్ధరించి, ఆదివాసీల కోసం ప్రత్యేక డీఎస్సీ నిర్వహిస్తామన్న హామీని చంద్రబాబు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అమలుచేయకుంటే ఆదివాసీలంతా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాల్లో ఆదివాసీల ఉద్యోగాలంతా ఆదివాసీలకే చెందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే గిరిజనుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సింహాచలం, కోశాధికారి వంతాల రామారావు, అసోషియేట్ అధ్యక్షుడు ఎం. ఈశ్వర్‌రావు, అధిక సంఖ్యలో ఉద్యోగులు, ఆదివాసీ నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కశింకోట: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు జరగనుందని ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు. ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఆయుర్వేదంతో చక్కటి ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ లావణ్య తదితరులు

అనకాపల్లి: కరోనా వంటి విపత్తు తర్వాత ఆయుర్వేదంపై ప్రజలకు ఆసక్తి పెరిగిందని ఎన్టీఆర్ వైద్యాలయం ఆయుష్ విభాగం వైద్యురాలు కె.లావణ్య అన్నారు. మండలంలో తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలో ఆయుష్ వైద్యంపై ఏఎన్ఎంలు, ఆశవర్కర్లకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించి, ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ లావణ్య మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు ఆయుష్ విభాగంలో ఉచితంగా వైద్యం చేసి మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.నిత్యం యోగా చేయడం వల్ల వ్యాధులతో బాధపడే రోగులు ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు నరసత్ సమీమ్, వాణీ జగదీశ్వరీ, యోగ శిక్షకుడు బి.అప్పారావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభకు భారీగా అర్జీలు



గ్రామసభకు హాజరైన ప్రజలు

కశింకోట: మండలంలోని సుందరయ్యపేటలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభకు భారీగా అర్జీలు వచ్చాయి. భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 223 మంది అర్జీలు దాఖలు చేశారు. భూముల కొలతల్లో హెచ్చుతగ్గులు, రీసర్వేలో లోపాలు, పేర్ల మార్పులు తదితర అంశాలపై రైతులు తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావుకు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రామారావు, రీసర్వే ఉప తహసీల్దార్ భాస్కరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న వరి చేలు

మాడుగుల : ఆరుగాలం కష్టపడి పండించిన వరి చేలు ప్రస్తుతం పొట్టదశకు కొన్ని, పంట దశకు మరికొన్ని చేరుకుంటున్నాయి. ప్రస్తుతం మెట్ట ప్రాంతాల్లో వరి చేలకు సాగునీరు లేక ఎండిపోతున్నాయి. మండలంలో ఖరీఫ్ వరి సాధారణ విస్తీర్ణం 10,500 ఎకరాలు కాగా ఈ ఏడాది 12 వేల ఎకరాల్లో సాగు చేశారు. పంట చేతికి అందుతున్న తరుణంలో వర్షాలు లేకపోవడంతో పాటు తెగుళ్లు ఆశిస్తున్నాయని, దీని వల్ల దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. పెట్టుబడులు అధికంగా ఉండడం వల్ల ఈ ఏడాది గత ఏడాది కటే ఎక్కువ మద్దతు ధరలు పెంచాలని, కొనుగోలు కేంద్రాలు పంట కోసే సమయానికి ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

అనకాపల్లి సినిమాలు

దేవర	:రాజా
'క'	:సత్యనారాయణస్క్రీన్-1
అమరాన్	:సత్యనారాయణస్క్రీన్-2
వేట్టయాన్	:షిర్డిసాయి
జనక అయితే గనక	:పర్తిసాయి
బఘీర	:వెంకటేశ్వర
విశ్వం	:శ్రీసత్య
లక్కీభాస్కర్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 34 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-15 యూనిట్లు, ఓ పాజిటివ్-17 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 228 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 169 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

భయపెడుతున్న శునకాలు



- గ్రామాల్లో పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- భయాందోళనలో మండల, పట్టణ ప్రజలు
- పట్టించుకోని జీవీఎంసీ, పంచాయతీ అధికారులు

మొరిగే కుక్కలు కరవవని అంటారు.. అది ఒకప్పుడు. ఇప్పుడు కుక్కలు ఎక్కడ పడితే అక్కడ పిక్కలు పట్టుకుని పీక్కు తింటున్నాయి. రాత్రీపగలు అనే తేడా లేకుండా చెండాడుతున్నాయి. పాదచారులు, వాహన చోదకులు, చిన్నా పెద్ద అనే తేడా లేకుండా దాడి చేస్తున్నాయి.



రోడ్డుపై తిరుగుతున్న కుక్కలు

తుమ్మపాల: కుక్కల సంతతి రోజు రోజుకు పెరుగుతోంది. నిత్యం ఒకరో ఇద్దరో వాటి బారిన పడి ఆస్పత్రి పాలవుతున్నారు. అయితే నివారణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు విఫలమవుతున్నారు. దీంతో ఎక్కడ పడితే అక్కడ కుక్కలు యథేచ్ఛగా తిరుగుతూ ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయి.

గుంపులుగా తిరుగుతూ దాడులు..

మండలంలో తుమ్మపాల, కొత్తూరు, పిసినికాడ, రేబాక, మామిడిపాలెం, మార్టూరు, వెంకుపాలెం, వేటజంగాలపాలెం, కూండ్రంలో వీధి కుక్కల సంఖ్య పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో కుక్కలు అధికమయ్యాయి. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడికి దిగుతున్నాయి. వాటి భయంతో ప్రజలు ప్రశాంతంగా తిరగలేకపోతున్నారు.

కుక్కల వల్ల రోడ్డు ప్రమాదాలు..

రహదారుల పక్కన గుంపులు గుంపులుగా ఉన్న కుక్కలు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండల పరిధిలోని తుమ్మపాల, రేబాక, మామిడిపాలెం, కొత్తూరు తదితర గ్రామాల ప్రధాన కూడళ్లలో ద్విచక్ర వాహన చోదకుల పరిస్థితి ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై వెళ్తున్న వాహన చోదకులపై కుక్కలు దాడులకు దిగుతున్నాయి. గ్రామాల్లో ఎక్కడైనా కుక్క కాటుకు గురైన వారు మందుల కోసం అధికారులను నిలదీస్తే కనీసం స్పందించే పరిస్థితి కనిపించడం లేదు. గ్రామాలు, పట్టణంలోని వార్డుల్లోకి కొత్తవారు అడుగు పెట్టాలంటే వణికిపోతున్నారు. కొన్ని గ్రామాల్లో చీకటి పడితే శునకాల భయంతో ప్రజలు వీధుల్లో అడుగు పెట్టడం లేదు.

అధికారుల చర్యలు శూన్యం..

పట్టణంలోని పలు వార్డులు, గ్రామాల్లో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ దాడులు చేస్తున్నా వాటి నియంత్రణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆవేదన ప్రజల్లో వ్యక్తమవుతోంది. కుక్కల దాడి వల్ల ఆస్పత్రుల పాలవుతున్నామని బాధితులు వాపోతున్నారు. వాహనాలపై వెళ్లే వారిని వెంబడించి దాడి చేస్తున్నాయని, కొన్నిసార్లు ఇళ్లల్లోకి సైతం చొరబడుతున్నాయని చెబుతున్నారు.



ఇంట్లోకి జొరబడేందుకు చూస్తున కుక్కల గుంపు

చిన్నారుల సంగతేమిటి?

కుక్కల దాడి నుంచి పెద్దవారు ఏదోలా తప్పించుకుంటారు. మరి చిన్నారుల సంగతేమిటి? వారి పరిస్థితి దయనీయంగా ఉంటుంది. కుక్కలు పెద్దవారిని అయితే కాళ్ల పిక్కలు పట్టి లాగుతాయి. పిల్లల ఎత్తుకు శునకాలు సమాంతరంగా ఉండటంతో ముఖం, మెడ, చెవి, వీపు భాగాల్లో దాడి చేస్తాయి. కాటేసిన శరీర భాగం లోతు ఆధారంగా వైద్యులు చికిత్స చేయాల్సి ఉంటుంది.

ఈ జాగ్రత్తలు పాటించండి

- మాంసం దుకాణాలు, హోటళ్ల వద్ద ఆహార వ్యర్థాలను సక్రమంగా నిర్వహించాలి.
- పెంపుడు కుక్కలకు రేబిస్ సోకకుండా ఏడాదికి ఒకసారి విధిగా టీకాలు ఇప్పించాలి.
- వీధి కుక్కలకు కూడా పురపాలక, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో టీకాలు వేయాలి.
- అన్ని వీధుల్లో శునకాలు స్వైర విహారం చేస్తున్నందున పిల్లలను ఒంటరిగా బయటికి పంపకూడదు.
- కుక్క కాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానంపై అవగాహన పెంచుకోవాలి.

బయటికి రావాలంటే భయమేస్తోంది..

మండలంలో అనేక గ్రామాల్లో కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉంది గ్రామాల్లో కనీసం 100 నుంచి 150 వరకు కుక్కలు నిత్యం స్వైరవిహారం చేస్తు ప్రజలను గాయపరుస్తున్నాయి. ఇంటి నుంచి బయటికి రావాలంటే భయమేస్తోంది. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు రోడ్డుపై నడుస్తుంటే వెంటపడి కరుస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. కుక్కల్ని పట్టుకోవాల్సిన అధికారులు అధిక ఖర్చుల కారణం చూపిస్తు తప్పించుకుంటున్నారు.

– కొత్తపల్లి నాగేష్, రేబాక గ్రామం.

నివేదిక అందజేశాం..



గ్రామాల్లో కుక్కలు ఎక్కువగానే ఉన్నాయి. వీటికి స్టెరిలైజేషన్ చేయించే అంశమై పశు వైద్యాధికారులకు నివేదికలు అందజేశాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే చర్యలు చేపడతాం. ఏదైనా ఏజెన్సీ ద్వారా కుక్కలను పట్టి సుదూర ప్రాంతాలకు తరలించేందుకు కార్యాచరణ చేపడతాం. ప్రజలకు వీటి బాధ లేకుండా చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తాం.

– కె.ధర్మారావు, ఈవోపీఆర్డీ, అనకాపల్లి మండలం

రైతులు చీడపీడలపై దృష్టి సారించాలి

అనకాపల్లి: వాతావరణ పరిస్థితుల వల్ల వరిలో కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగు పెరిగే అవకాశం ఉందని, నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును 2 గ్రాములు లేదా అసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లి పురుగు కనిపిస్తే ట్రైకోగ్రామా గుడ్డు పరాన్న జీవిని ఎకరాకు 20 వేలు చొప్పున విడుదల చేస్తుందన్నారు. చెరకులో పిండినల్లి ఉధృతి పెరిగి మొజాయిక్ తెగులు వ్యాప్తి చేస్తుందని, నివారణకు డైమితోయేట్ 2 మిల్లీలీటర్లు, లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. బెల్లం రైతులు చెరకును నేలకు దగ్గరగా నరకాలని, చెరకు నరికిన 24 గంటల్లోపు బెల్లం ఆడుకోవాలని సూచించారు. ఎరువుల యాజమాన్యం ఎకరా పొలంలో 55 కిలోల యూరియా, 220 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 60 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్‌ను ఆఖరి దుక్కిలో వేసుకోవాలన్నారు. కలుపు నివారణకు విత్తిన 3 రోజుల్లోపు అట్రాజిన్ కలుపు మందును లీటరు నీటిలో 5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. పూత దశలో ఉన్న వరిపైరులో సస్యరక్షణ కోసం చేసే పురుగు మందుల పిచికారీ సాయంత్రం వేళల్లో మాత్రమే చేయాలని తెలిపారు.

కూలిన గోడతో ఇక్కట్లు



క్రీడా మైదానంలో కూలిపోయిన ప్రహరీ

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో వెనుక వైపు ప్రహరీ గోడ పడిపోయి సుమారు మూడు మాసాలు అవుతున్నప్పటికీ జీవీఎంసీ అధికారులు పట్టించుకోలేదు. జీవీఎంసీ విద్యుత్ విభాగం ఉద్యోగులు పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే సెంటర్ లైటింగ్, వీధి దీపాల స్తంభాలు అక్కడే ఉన్నాయి. ప్రహరీ పడిపోవడంతో రాత్రి సమయంలో మందుబాబులకు ఇది అనుకూలంగా మారింది. వారు మద్యం తాగి ఆ సీసాలు పగులగొట్టి వాకింగ్ ట్రాక్‌పై పడేయడం వల్ల వాకర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. తక్షణమే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వాకర్లు, క్రీడాకారులు కోరుతున్నారు.

ఘనంగా నాగదుర్గమ్మ జాతర



నాగదుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు



నాగదుర్గమ్మ పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



సాంస్కృతిక కార్యక్రమం

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో వేంచేసిన నాగదుర్గమ్మ జాతర మహోత్సవం మంగళవారం నేత్రపర్వంగా జరిగింది. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేసి, అక్కడి పుట్టలో పాలు పోశారు. అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. సాయంత్రం 4 నుంచి జాతరను పురస్కరించుకుని నేలవేషాలు, స్టేజీ ప్రోగ్రాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేగి త్రినాథ్ ఆధ్వర్యంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్-2024, రింగ్‌రోడ్డు జంక్షన్ వద్ద చినరామ యంగ్ టైగర్స్ యూత్ వారి ఆధ్వర్యంలో అనకాపల్లి ఆన్ ఫైర్ డ్యాన్స్ హంగామ, రేలా రేలా డ్యాన్స్, కూచిపూడి డ్యాన్స్, కోలాటం, అమ్మవారి ఆలయం నుంచి రింగ్‌రోడ్డు జంక్షన్ వరకూ సుజీ లైటింగ్ సౌండ్స్ వారిచే విద్యుత్ లైటింగ్, గవరపాలెం మందుగుండు సీతారామయ్య వారి ఆధ్వర్యంలో అపూర్వ బాణసంచా మెరుపుల వంటి కార్యక్రమాలు జరిగాయి. పట్టణ, మండలంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఉత్సవాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భీశెట్టి తాతారావు, కార్యదర్శి పాలమేర బాజ్జి, కోశాధికారి బుద్ద పెంటారావు, అలయ అర్చకులు కొడుకుల శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కరుణించి కాపాడు.. నాగేంద్ర



రాణిగారి తోట వద్ద పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



ఎన్టీఆర్ మార్కెట్ ఆవరణలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



జాతీయ రహదారి ఉమ్మలాడ జంక్షన్ వద్ద భక్తులు



ఏఎస్‌పేటలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: పట్టణ, మండలంలో నాగుల చవితి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. పట్టణంలో రాణిగారి తోట, ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు ఆవరణ, శారదా నది గట్టు, ప్రేమసమాజం, గాంధీనగరం, అంజయ్యకాలనీ, ఆర్ఏఆర్ఎస్ కార్యాలయం ప్రాంతాల్లో పట్టణవాసులు పుట్టల వద్దకు చేరుకుని నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలో కొత్తూరు, పిసినికాడ, రాజుపాలెం, సిరసపల్లి, గోపాలపురం, రేబాక, గొలగాం, మామిడిపాలెం, వల్లూరు, మారేడుపూడి కొప్పాక, సీతానగరం, వెంకుపాలెం, కూండ్రం, బీఆర్టీ కాలనీ, సత్యనారాయపురం తదితర గ్రామాల్లో ప్రజలు నాగుల చవితి పూజలు చేశారు.

కశింకోటలో..

కశింకోట: మండలంలోని ఏఎస్ పేటలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులతో కలిసి నాగుల చవితి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, పార్టీ యువజన విభాగం నాయకుడు మలసాల కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఉగ్గినపాలెంలో ఎంపీపీ కలగా లక్ష్మి, గున్న య్యానాయుడు దంపతులు, కశింకోటలో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, శ్రీనివాసరావు దంపతులు, తాళ్లపాలెంలో ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవానీ, గణేష్ దంపతులు భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు జరుపుకున్నారు.

గాడివీధిలో..

స్థానిక గాడి వీధిలో వెలసిన నాగేంద్రస్వామి ఆలయాన్ని ప్రజలు దర్శించుకున్నారు. పాలు, గుడ్లు పుట్టలో వేసి పూజలు చేశారు. చీరలు, రవికెలు, అరటి గెలలు, తల నీలాల రూపంలో మొక్కుబడులు తీర్చుకున్నారు. కోలాటాలు, చెట్టు భజనలు చేశారు. గ్రామాల్లో సంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.



కశింకోటలోని గాడివీధిలో వెలసిన నాగేంద్ర స్వామి ఆలయంలో నాగుల చవితి పూజలు

చెత్త తొలగించారు



చెత్త తొలగించక ముందు



చెత్త తొలగించిన తర్వాత

సాక్షి ఎఫెక్ట్..

కశింకోట: 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు సత్వరమే స్పందించారు. కశింకోటలోని 6వ ప్రాథమిక పాఠశాల ముందు ఉన్న చెత్తను మంగళవారం ఆఘమేఘాల మీద పంచాయతీ పారిశుధ్య సిబ్బంది సహాయంతో తొలగించారు. చెత్త విషయాన్ని సాక్షిలో 'పేరుకుపోయిన చెత్త' శీర్షికన మంగళవారం వార్త ప్రచురించిన సంగతి తెలిసిందే. దీంతో స్పందించిన పంచాయతీ అధికారులు దీన్ని తొలగించడానికి చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు సాక్షికి అభినందనలు తెలిపారు. ఇదిలా ఉండగా పంచాయతీరాజ్ ఈవో ఎం. వెంకటలక్ష్మి ఈ సందర్భంగా స్కూలు యాజమాన్యం, ప్రజలకు సూచన చేశారు. స్కూల్లో చెత్త బయట వేస్తున్నారని, ఇకపై అలా చేయకుండా చెత్త బండి వచ్చినప్పుడు పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని పాఠశాల హెచ్ఎంకు సూచించారు. అలాగే రోడ్లపై చెత్త వేయరాదని, చెత్త బండి వచ్చినప్పుడు ఇళ్లలో చెత్తను తెచ్చి వేయాలని తెలిపారు.

ఘనంగా జాజులమ్మ పండగ



మల్లవరంలో జాజుల్ని మోస్తున్న మహిళా భక్తులు

అచ్యుతాపురం: జాజులమ్మ పండగ మంగళవారం ఘనంగా జరిగింది. తలపై నవదినుసులతో పెరిగిన మొక్కల బుట్టను పెట్టుకొని జాజులమ్మ నామస్మరణ చేసే మహిళలకు కోరికలు తీరుతాయని నమ్మకం. ఊరంతా జాజులమ్మ నామస్మరణ చేస్తూ చవితి రోజున బుట్టలను మోస్తూ సాగునీటి కాలువలో నవదినుసుల మొక్కల్ని వదులుతారు. గ్రామీణ ప్రాంతంలో ఒక్కోచోట ఒక్కో రకంగా నాగులచవితి వేడుకలు జరుగుతాయి. అచ్యుతాపురం మండలంలోని మల్లవరంలో ప్రతి ఏటా దీపావళి నుంచి నాగులచవితి వరకూ జరిగే నవదినుసుల పూజలు, చవితి రోజున జాజులమ్మ పండగకు విశిష్ట చరిత్ర ఉంది. మల్లవరంలోని ఓ ఇంటిలో తాటాకు బుట్టలో నవదినుసులను వేసి దీపావళి నుంచి నాగులచవితి వరకూ ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ పూజలు చేస్తారు. నవదినుసులు మొలకెత్తుతాయి. ఈ జాజుల్ని గౌరీపరమేశ్వరులుగా భావించి నాగులచవితి ఉదయం నుంచి బుట్టల్లో వేసి గ్రామంలో ఊరేగిస్తారు. ఈ బుట్టలు మోస్తే పెళ్లి కాని యువతులకు వివాహం జరుగుతుందని, పిల్లలు లేని వారికి సంతానం కలుగుతుందనే విశ్వాసం ఉంది. చివరగా జాజుల్ని స్థానికంగా నీరు పారే కాలువలో వదిలారు. దీపావళి నుంచి నాగులచవితి వరకూ జరిగిన జాజులమ్మ పండగ మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కండిపల్లి శ్రీనివాసరావు, గీసాల నాగమణి, పిన్నమరాజు వాసు, బీజేపీ నాయకులు చిన్నారావు, రవీంద్ర, చందక శివ, బాబ్జి, చిరంజీవి, రాజు, తిరుమలరావు, నాగేశ్వరరావు, గీసాల లోవ, వెంకట్, సూరిబాబు, నగేశ్, గండిబోయిన ప్రసాద్ పాల్గొన్నారు.

భోగలింగేశ్వరాలయంలో ఊంజల్ సేవ



పూజలు చేస్తున్న రమణాజీ, సరోజిని దంపతులు



భరతనాట్య ప్రదర్శన నిర్వహించిన సిరి స్పందన బృందం సభ్యులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం కోటవీధిలో సర్వకామదాంబ సమేత శ్రీ భోగలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని స్వామివారికి సోమవారం రాత్రి ఊంజల్ సేవ నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త బుద్ద రమణాజీ, సరోజిని దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సిరి స్పందన బృందం వారిచే భరతనాట్య కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితులు భీమేశ్వరరావు, వేణు, గోపి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కె.జె.పురంలో గౌరీపరమేశ్వరుల విగ్రహ ప్రతిష్ట



కె.జె.పురంలో గౌరీ పరమేశ్వరులకు పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామంలో శ్రీ గౌరీపరమేశ్వరులను మంగళవారం రాత్రి ప్రతిష్ఠించారు. గ్రామంలో శాలిపేట వీధిలో గల బాల వినాయక కమ్యూనిటీ హాలులో ప్రతిష్ఠించిన గౌరీ పరమేశ్వర్లకు 21 రోజుల పాటు పూజలు నిర్వహించి, అనంతరం నిమజ్జనోత్సవం జరుపుతారు. ప్రతి ఏటా నాగుల చవితి పర్వదినం రోజున గౌరీ పరమేశ్వర్లను ప్రతిష్ఠించడం ఆనవాయితీ. ముందుగా గౌరీ పరమేశ్వర్లను పుర వీధుల్లో ఊరేగించారు. గ్రామస్తుల సహకారంతో జరిగే ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావుతో పాటు స్థానిక ప్రజలు, మహిళలు, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.